"ఆ పార్కులో ఏ దెయ్యం పడుతుందో ఈయన్ని. వెళ్ళొచ్చిన దగ్గర్నుంచి పిచ్చి పిచ్చిగా ఉంటాడు" అని సణుక్కుంటుంది సావిత్రి.

ఈవెనింగ్ వాక్‌కని వచ్చిన సీనియర్ సిటిజన్స్ భాగ్యలక్ష్మీనగర్ కాలనీలో ఉన్న మున్సిపాల్టీ పార్కులో బెంచీల మీద చేరుకుని ఇంటింటి రామాయణం వినిపిస్తుంటారు. కుళ్ళిపోతున్న రాజకీయాల గురించో, చెడిపోతున్న సమాజం విషయమో, పెటాకులవుతున్న ప్రేమ పెళ్ళిళ్ళ టాపిక్కో ఎత్తుకుని గంటల తరబడి వాదించుకుంటారు. సుగర్ పేషెంట్లు ఆకలేస్తున్నది ఆగలేమంటూ తొందరగా నిష్క్రమిస్తారు. గట్టి పిండాలు నోళ్ళు నొప్పి పెట్టే వరకూ, గొంతులో తడి ఆరిపోయేవారకూ ఉంటారు. కడుపులో ఎలుకలు పరిగెత్తుతుంటే అప్పుడు లేస్తారు.

సావిత్రి సణుక్కుంటున్నట్లే పార్కులో ఉన్నంతసేపూ సుందర్రావుని డబ్బు దెయ్యం పడుతుంది. సీనియర్ సిటిజన్స్‌లో చాలామంది పిల్లలు అమెరికాలోనో, లండన్‌లోనో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా సెటిలయ్యారు. వీళ్ళు ఊళ్ళొదిలిపెట్టి రాజధాని చేరి వాళ్ళు పంపిస్తున్న డాలర్లు, పౌండ్లు పెట్టి భూములు, ఇళ్ళు కొంటూ కోట్లకు పడగలెత్తు తున్నారు.

వాళ్ళ సంభాషణల్లో దొర్లే లక్షలు, కోట్లు వింటూ తనకు చెపుడొచ్చినా బాగుండేది అని వాపోతుంటాడు. ప్రయోజకులైన కొడుకులుండడం ఎంత అదృష్టం? హు... తనకీ ఉన్నారు కొడుకులు. ఏం లాభం? కొడుకుల్ని తల్చుకుంటే సుందర్రావుకి బి.పి. రెయిజై పోతుంది. వెధవాయిలు పనికిరాని చదువులు చదివారు. పెద్దోడేమో ఎం.కామ్. చదివి ఏదో కంపెనీలో లెక్కలు రాసుకుంటున్నాడు. పోనీ హైదరాబాద్‌లో కళ్ళముందున్నాడా అంటే అదీలేదు. తోడల్లుడున్నాడనీ, పెళ్ళాం మాటలు వినీ బెంగుళూరు వెళ్ళిపోయాడు. చిన్నోడు తనకు మెకానికల్ లైఫ్ బోరుకొడుతున్నది క్రియేటివ్ ఫీల్డ్‌కెళ్తానని గ్రాఫిక్ డిజైనింగ్ నేర్చుకుని బొంబాయి వెళ్ళిపోయాడు. ఏదో వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతున్నారు.

ఉద్యోగంలో ఉన్నంతకాలం సుందర్రావుకి హాయిగానే ఉంది. రిటైరైన తర్వాతే అసంతృప్తి మొదలైంది. ఆదాయం నాలుగో వంతుకి పడిపోయింది. పెన్షన్ డబ్బులు ఏ మూలకూ చాలడంలేదు. సంవత్సరం పొడుగునా గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఉన్న బంధువుల పిల్లల పెళ్ళిళ్ళనీ, గృహప్రవేశాలనీ, ఏవొకటీ వస్తుంటాయి. పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి వెళ్దామా? ఇంటర్ సిటీకి బయల్దేరదామా? అని సావిత్రి మూటాముల్లె సర్దుకుని రెడీగా ఉంటుంది. డబ్బు ఖర్చు గురించి క్షణం ఆలోచించదు. మన పిల్లలు ఎటూ వెళ్ళరు. మనం ఉన్నంత వరకు తప్పదు. లేకపోతే చుట్టరికాలేం మిగుల్తాయి? అని క్లాస్ పీకుతుంది.

